క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పంచాయతీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు దృష్ట్యా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా బంద్ చేస్తున్నట్లు ఏఈ క్రాంతిసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా ఏదులాపురంతో పాటు శ్రీరాంపగర్, సత్యసంకల్ప నగర్, ఆటోనగర్, షాబాద్‌నగర్, వార్త బ్యాక్ ఏరియా, వరంగల్ క్రాస్‌రోడ్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

నేటి పాదయాత్రను జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఉదయం నయాబజార్ కళాశాల నుంచి గట్టయ్య సెంటర్ ఎస్ఎస్‌పీ క్యాంప్ స్కూల్ వరకు జరిగే జనసేన–యువశక్తి పాదయాత్రను జయప్రదం చేయాలని ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ మిరియాల రామకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. అనంతరం ఎస్ఎస్‌పీ క్యాంప్ స్కూల్ ఎదుట గ్రౌండ్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ వర్ధంతికి తరలిరావాలి

ఖమ్మంరూరల్: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని శనివారం మండలంలోని కరుణగిరిలో నూతనంగా నిర్మిస్తున్న వైఎస్సార్‌టీపీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌టీపీ నాయకుడు నంద్యాల రవీందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

4న శ్రీకోటమైసమ్మ ఆలయంలో వేలం

కామేపల్లి(కారేపల్లి): ఈ నెల 4వ తేదీన మండల పరిధిలోని కొత్తలింగాల గ్రామంలో శ్రీకోటమైసమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల వస్తువులు అమ్ముకొనుటకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.శేషయ్య, ఆలయ చైర్మన్ మల్లంపాటి శ్రీనివాసరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొనే వారు రూ.5వేలు డిపాటిట్ చేయాలని, ఈ వేలం పాట కాలపరిమితి ఒక సంవత్సరం వరకు ఉంటుందని పేర్కొన్నారు. కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోర ప్రసాదములు అమ్ముకొనుట, కొబ్బరి చిప్పలు పోగుచేసుకొనుట, తలనీలాలు వంటి వాటికి వేలం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

రజకుల అభివృద్ధికి కృషి చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో రజకులు ఆర్థికంగా, రాజకీయంగా చాలా వెనుకబడి ఉన్నారని, రజకుల అభివృద్ధి కోసం అన్ని పార్టీలు కృషి చేయాలని యువజన సంఘాల సమితి రాష్ట్ర నాయకుడు, సమైఖ్య రజక సంఘం జిల్లా నాయకుడు జక్కుల వెంకటరమణ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కాగా, మాజీమంత్రి బసవరాజు సారయ్యకు శాసన మండలి సభ్యుడిగా అవకాశం కల్పించి, రజకులకు ఉచిత విద్యుత్, మోడ్రన్ దోబీఘాట్‌ల కోసం నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఖమ్మంఅర్బన్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్ తెలిపారు. నగరంలోని 8వ డివిజన్ వైఎస్సార్ కాలనీ జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన 'తిరగబడదాం–తరిమి కొడదాం'కార్యక్రమంలో ఆయన మాట్లాడాఉ. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడగా.. డివిజన్లలో ప్రతీ గడపకు తిరుగుతూ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మహిళా ఉపాధ్యక్షుడు చర్ల పద్మ, డివిజన్ కార్పొరేటర్ లకావత్ సైదులు, నల్ల మల సత్యంబాబు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఏలూరు రవి, మహిళా కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి పుష్ప, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నేలకొండపల్లి: మున్నూరు కాపు యూత్ మండల అధ్యక్షుడిగా చెరువుమాధారం గ్రామానికి చెందిన ఆకుల నరసింహారావును నియమించారు. శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు బి.సంజయ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు స్థానిక యువత, సంఘం పెద్దలు స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపి బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

సర్టిఫికెట్లు.. సవాల్!



ఖమ్మం అర్బన్ తహసీల్‌లో సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తుదారులు

కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం సవాలక్ష సమస్యలు

- తహసీల్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దరఖాస్తుదారులు
- నెలలు గడుస్తున్నా అందని పత్రాలు
- కార్యాలయాల్లో పడిగాపులు కాస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు

తెలంగాణ ప్రభుత్వం ప్రకటిస్తున్న వివిధ సంక్షేమ పథకాల లబ్ధికోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలకు సవాలక్ష సమస్యలు ఎదుర్కొంటున్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైయ్యే కులం, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలను పొందడం సవాల్‌గా మారుతోంది. అందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పడిగాపులు కాయాల్సి వస్తోంది. అయినా సకాలంలో సర్టిఫికెట్లు అందకా.. పథకాలకు దూరమవుతున్నారు.

ఖమ్మంఅర్బన్: అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పత్రాల కోసం అప్లై చేసుకున్న దరఖాస్తులు వందల సంఖ్యలో ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బీసీబంధు, దళిత బంధు, గృహలక్ష్మి వంటి పథకాలతో పాటు విద్యార్థులకు ఉన్నత చదువులకు అవసరమయ్యే కులం, ఆదాయం సర్టిఫికెట్లు తప్పనిసరిగా కావాల్సి ఉండడంతో సమీపంలోని మీ సేవా కేంద్రాల వద్ద దరఖాస్తులు చేసుకుంటూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇకనైనా తమ సర్టిఫికెట్లు వస్తాయోనని ఎదురుచూస్తున్నా.. రోజులు, నెలలు గడుస్తున్నప్పటికీ దరఖాస్తుదారులకు అందడంలేదని వాపోతున్నారు. మీసేవలో దరఖాస్తు చేసుకొన్న పత్రాలపై తహసీల్‌లోని ఆర్ఐలు ఆమోదముద్ర వేసిన తర్వాత కార్యాలయంలో అందిస్తే అన్ని మంచిగా ఉంటే సర్టిఫికెట్లు వస్తున్నాయి.. లేకపోతే అంతే సంగతి.

తప్పని ఎదురుచూపులు..

మీసేవలో దరఖాస్తు చేసుకొని కొంతమందికి ఎదురుచూపులు తప్పడం లేదు. కులం సర్టిఫికెట్లలో ఒకే కుటుంబంలోని పిల్లలు, భర్తకు సర్టిఫికెట్ అందుతుంది కాని భార్యకు మాత్రం అందడం లేదు. కారణం పుట్టింటి నుంచి కుల సర్టిఫికెట్ లేదా స్టడీ సర్టిఫికెట్ కావాల్సి వస్తోంది. కాకపోతే అటువంటి ధ్రువపత్రాలు తాము ఎక్కడ నుంచి తేవాలంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలా అని నేరుగా వచ్చి ఆర్ఐల ద్వారా పత్రాలను రాయించుకుందామంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తుందని, ఒక్కో రోజు అదనపు డ్యూటీ అంటూ అధికారులు కార్యాలయం వైపే చూడడం లేదు. దీంతో చూసి చూసి కళ్లు కాయలు కాయడమే తప్ప ఫలితం ఉండటం లేదని పలువురు వాపోతున్నారు.

జారీలో జాప్యం..

సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేస్తుండడంతో రోజులు తరబడి వేచి చూడాల్సి వస్తోందని దరఖాస్తుదారులు చెపుతున్నారు. కొంతమంది విద్యార్థులు తాము కాలేజీలో చేరడానికి, ప్రభుత్వ సాయం కోసం మరికొంతమందికి గడువు ముంచుకొస్తుందని వేడుకుంటున్నా.. పత్రాలు జారీ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులు వీఆర్ఏలు, వీఆర్‌ఓలతో పాటు ఇద్దరు ఆర్ఐల ద్వారా ఎటువంటి ఒత్తిడి లేకుండా పత్రాలు జారీ చేసేవారు. కాని ఇప్పుడు ఉన్న పనితో పాటు ఇతర విధులు అనగా 59, 58 జీఓల విచారణ, గృహలక్ష్మి విచారణ, ప్రభుత్వ కార్యక్రమాల విధుల్లో పాల్గొనడం, ప్రొటోకాల్ విధులు తదితర వాటితో పని ఒత్తిడి పెరిగి ఇబ్బందిగా ఉండడంతోనే జాప్యం జరుగుతుందనే వాదన వినిపిస్తున్నారు. గత మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు ఆర్ఐలు కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో అనేక మంది దరఖాస్తుదారులు ఎదురు చూసి వెనుదిరిగారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసి సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

రెండు నెలలు అవుతోంది..



మా కోడలు కులం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసి రెండు నెలలు అవుతోంది. బీసీ రుణాలు, గృహలక్ష్మి పథకాలకు కుల సర్టిఫికెట్ అవసరం కావడంతో మీ సేవలో దరఖాస్తు చేశాం. ఇంకా సర్టిఫికెట్ రాకపోవడంతో వారిని అడిగితే పుట్టింటి నుంచి ఏదైనా ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. అవి దొరక్క కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం.

– ఎస్‌కె.దస్తగిరి, పాండురంగాపురం

కాలేజీలో చేరాల్సి ఉంది..



కాలేజీలో చేరాలంటే కులం సర్టిఫికెట్ కావాలన్నారు. దాని కోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నా. జాయినింగ్ గడువు ముగిస్తుందే కాని పత్రం మాత్రం అందడంలేదు. 10 రోజులు నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని మాత్రం కావడం లేదు. అంతేకాక కార్యాలయంలో అధికారులు సరిగా అందుబాటులో ఉండడం లేదు.

– కె.నీలాంబరి, విద్యార్థిని, సారధినగర్

యూసీసీ బిల్లును వ్యతిరేకించండి



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న ఎన్నికల దృష్ట్యా 'ఇండియా'కూటమికి భయపడి యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ)ను తెరపైకి తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని తంజీ మీమ్స్ ఆఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మహ్మద్ సలాం అన్నారు. శుక్రవారం వాయిద్య మజీద్ వద్ద నిర్వహించిన ముస్లింల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకపక్క మణిపూర్ రగిలిపోతుందని, హర్యానాలోని అల్లర్లనను కేంద్ర ప్రభుత్వం కావాలనే సృష్టిస్తోందన్నారు. మైనార్టీలను, ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీలను లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వాలు డ్రామా ఆడిస్తున్నాయని విమర్శించారు. యూసీసీని ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో ఆవాస్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎండి గౌస్, ఎండి రెహమాన్, ఖాదర్, అసర్, మీరా తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్‌కు పరామర్శ



మల్లిబాబుయాదవ్‌తో నాయకులు

కామేపల్లి(కారేపల్లి): డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేకల మల్లిబాబుయాదవ్‌ను జిల్లా అఖిల భారత యాదవ మహాసభ నాయకులు శుక్రవారం పండితాపురం గ్రామంలో పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడుచిలకల వెంకటనర్సయ్య, యువజన జిల్లా అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి, బీజేపీ నాయకుడు అల్లిక అంజయ్యలు మాట్లాడుతూ.. మల్లిబాబుయాదవ్‌పై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం హేయమైన చర్య అని, కొంతమంది కుట్రపూరితంగా వ్యవహరిస్తూ బీసీ వర్గాల నాయకులను రాజకీయంగా ఎదగకుండా చేస్తున్నారని, రానున్న రోజుల్లో ఓటు బ్యాంకుతో వారికి బుద్ధి చెప్పుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జిల్లా నాయకులు పోతుల సతీష్, మల్లేశం, ప్రభాకర్, మారుతి ఎట్టయ్య, ముంత మల్లయ్య, కనకబండి పాండురాజు, దుబాకుల శ్రీనివాస్, ధరావత్ హరిచంద్ర, షేక్ ఫతేహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పంట భూములను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరావు

ఖమ్మం మామిళ్లగూడెం: రైతులకు పంట నష్టం కట్టించేదే ఆమ్ ఆద్మీ పార్టీనని పార్టీ తెలంగాణ కోర్ కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమలరావు అన్నారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజ్రీవాల్ రూపొందించిన విధానంతో జాతీయ పార్టీగా అవతరించి అధికారంలోకి రాగానే అన్ని రాష్ట్రాల్లో రైతులకు పంట నష్టాన్ని అమలు చేసేలా చూస్తామని చెప్పారు. రియల్ ఎస్టేట్ నియంత్రణ చేసి పంట భూములు రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడిగా ఎం.పురుషోత్తమరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా స్వర్ణ సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా రాజు, సహాయ కార్యదర్శిగా గోపాల్‌రావు, కోశాధికారిగా బానోత్ మోహన్‌లను ఎన్నుకున్నారు.

'గృహలక్ష్మి'లో ప్రాధాన్యత కల్పించాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంరూరల్: భవన నిర్మాణ కార్మికులకు గృహలక్ష్మి పథకంలో ప్రాధాన్యత కల్పించి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, కార్మిక బంధు కింద రూ.10 లక్షలు ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన 3వ డివిజన్ బల్లేపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వం చెప్పినట్టుగా కార్మికులకు టూవీలర్ మోటార్ సైకిల్ ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డు నిధులను దారి మళ్లించొద్దని, దళారీ వ్యవస్థను అరికట్టాలని, అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు త్వరగా అమలు చేయాలని కోరారు. అలాగే ఖమ్మంరూరల్ మండలం ఎంవెంకటాయపాలెంలో జరిగిన సమావేశంలో సీఐటీయూ నాయకుడు మేడికొండ నాగేశ్వరరావు మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం నిధులు వెచ్చించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సమావేశాల్లో నాయకులు డి. పాపాచారి, షణ్ముఖాచారి, కె. వెంకన్న, గండి నాగయ్య, రాంబ్రహ్మం గౌడ్, సిలివేరు వెంకన్న, చింతల వెంకన్న భూమయ్య, రాములు, వెంకన్న, ఉప్పలయ్య, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ సందర్శన..

ఖమ్మంగాంధీచౌక్: ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆహార భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పొందేందుకు నగరంలోని విన్‌ఫీల్డ్ విద్యార్థులు శుక్రవారం భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోదాంలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ అధికారులు, ఉద్యోగులు ధాన్యం సేకరణ, నిల్వ చేయటం, పంపిణీ ప్రక్రియ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ ఎఫ్‌సీఐ అధికారి బి.రంగప్రసాద్ నాయక్, ఇతర మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును వినియోగించుకోవాలి

తిరుమలాయపాలెం: ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేస్తున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం తహసీల్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శని, ఆది వారాల్లో మండలంలోని 64 పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, ఓటర్ల సవరణ, కొత్త ఓట్ల నమోదు చేసుకోవాలని, ఓటరు లిస్టులో సవరణలు ఏమైనా ఉంటే ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు.

ఎల్ఐసీ వారోత్సవాలు



వెంకటరమణను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: ఎల్ఐసీ 67వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఆ శాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఎ.హన్మంతరెడ్డి, ఖమ్మం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సువర్ణరావు ఎల్ఐసీ ప్రగతిని వివరించారు. అనంతరం ప్రియదర్శిని విద్యాసంస్థల అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జ్ అట్లూరి వెంకటరమణ కవిత ద్వారా ఎల్ఐసీ అభివృద్ధిని వివరించినట్లు బాధ్యులు తెలిపారు. అనంతరం నూతన వ్యాపార పోటీల్లో విజేతలైన ఏజెంట్లకు బహుమతులు అందించారు.

మృతుడి కుటుంబానికి చేయూత

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంకు చెందిన అరిపికట్ల రాములు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో గ్రామ రైతు కన్వీనర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుతుంబాక నరేష్ శుక్రవారం మృతుడి చిత్రపటానికి నివాళులర్పించాక రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు తొలుపునూరి ధానయ్య, తదితరులు పాల్గొన్నారు.

సుబ్లేడును మండల కేంద్రంగా చేయాలి



ఎమ్మెల్యే కందాళకు రాసిన ప్లకార్డులను చూపిస్తున్న గ్రామస్తులు

తిరుమలాయపాలెం: సుబ్లేడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు షోయాబుల్లాఖాన్ విగ్రహం వద్ద పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మండడి ఇబ్రాయిల్ మాట్లాడుతూ.. తిరుమలాయపాలెం మండల కేంద్రానికి దూరంగా అనేక గ్రామాలు ఉండడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, 20 గ్రామ పంచాయతీలను కలిపి సుబ్లేడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రముఖ పాత్రికేయుడు నైజాం నవాబును ఎదిరించి పోరాడి ప్రాణత్యాగం చేసిన షోయాబుల్లాఖాన్ పుట్టిన గ్రామం అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, మధు, వీరస్వామి, కన్నయ్య, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి



వైద్యులతో మాట్లాడుతున్న నాయకులు

రఘునాథపాలెం: గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధులను అరికట్టాలని, వైద్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి టి.ఝాన్సీ, పీవైఎల్ డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మంచుకొండలో ప్రాథమిక వైద్యశాలను సందర్శించి ఆరోగ్య సమస్యలపై, అందుతున్న వైద్యం, మందులు తీరుపై సర్వే నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఏటా వర్షాకాలంలో లోపిస్తున్న పారిశుద్ధ్యం వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు సోకి ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. అందుకు గ్రామాల్లోని ప్రతీ వీధిలో బ్లీచింగ్ చల్లించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ డివిజన్ నాయకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన



ఖమ్మంఅర్బన్: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



తిరుమలాయపాలెం: డీటీకి వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఖమ్మంఅర్బన్/తిరుమలాయపాలెం: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్యర్యాన శుక్రవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో పాఠశాల విధులకు హాజరయ్యారు. దానిలో భాగంగా నగరంలోని రోటరీనగర్ పాఠశాలలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అలాగే తిరుమలాయపాలెం మండల తహసీల్ ఎదుట పీఆర్టీయూ నాయకులు నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఎన్నికలకు ముందే పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.హుస్సేన్, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యాయులు రామకృష్ణ, సుశీల, డీ.వీ.నాగేంద్ర బాబు, పద్మావతి, శ్రీనివాసరావు, సుభాషిణి, సంపత్, రమాదేవి, నాయకులు సతీష్, సత్యనారాయణరెడ్డి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో పాలకులు విఫలం

ఖమ్మంరూరల్: ఎన్నికల సమయాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా నాయకుడు మోరబోయిన పుల్లయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విధానాలతో వ్యవసాయం కుదేలైందని, రైతులకు కేంద్రం నుంచి ఒక్క సబ్సిడీ కూడా రావడంలేదని పేర్కొన్నారు. అలాగే తెలంగాణలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితం అయ్యాయని, రైతులకు ఉచిత ఎరువులు అందిస్తామన్నది ఒట్టి బూటకమని తేలిపోయిందని విమర్శించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్ వితరణ

నేలకొండపల్లి: మండలంలోని నాచేపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి రాయల యూత్ సభ్యులు ఫ్యాన్‌ను వితరణగా అందించారు. శుక్రవారం యూత్ సభ్యులు అంగన్‌వాడీ కేంద్రంలో యూత్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గట్టిగుండ్ల విజయ్ చేతుల మీదుగా టీచర్ నాగలక్ష్మికి అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు మారయ్య, నాగరాజు, సురేందర్, తిరుపతిరావు, బద్రి, గోపి, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖమ్మంరూరల్: గ్రామీ దీపికలకు వేతనాలు పెంచిన సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి శనివారం మండలంలోని వీఓఏలు క్షీరాభిషేకం చేశారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈకార్యక్రమానికి వీఓఏలు హాజరై సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు చిప్పడి సుగుణ, ప్రధాన కార్యదర్శి గడ్డమీది వెంకట్రావమ్మ, కొమరబత్తిని విజయకుమారి, హేమలత, ఆర్.మమత, పి.సరస్వతి, టి.రేణుక, బి.పద్మ, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

భట్టి సన్మానం..



అంజనికు శుభాకాంక్షలు తెలుపుతున్న భట్టి

నేలకొండపల్లి: సీఎల్‌పీ నేత భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ బృందంతో ఖమ్మం నుంచి ఆయన తిరుమలలో దర్శనం కోసం వెళ్లారు. అనంతరం జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి వేడుకలు ప్రారంభించారు. అనంతరం అంజినిని భట్టితో పాటు పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లిలో గల గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ సెల్యూలర్, మాలిక్యులర్ బయాలజీ, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రీయల్, టెక్నోలాజికల్ మ్యూజియం సంయుక్త ఆధ్వర్యాన మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా జన్యు సంబంధిత లోపాలు, రుగ్మతలు వాటి నివారణపై విద్యార్థినులు ప్రదర్శించారు. కాగా, విద్యార్థులు పారిశ్రామికంగా అవగాహన పెంచుకోవాలని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్ అన్నారు. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీయల్ డే సందర్భంగా కళాశాలలో విద్యార్థినులకు సెమినార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పారిశ్రామికపరంగా ఉన్న అనుమానాలను నివృతి చేశారు. ప్రిన్సిపాల్ బి.ఝాన్సీరాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వరాలిచ్చే వరలక్ష్మి..

నిజ శ్రావణం మూడో శుక్రవారం సందర్భంగా పలు ఆలయాల్లో సామూహిక కుంకుమార్చన, వరలక్ష్మి వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వరాలివ్వుతల్లి అంటూ మహిళలు అమ్మవారిని వేడుకొని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా పల్లికిలో ఉంచి మేళతాళాల నడుమ పల్లికి సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



నగరంలోని బోస్ బొమ్మ సెంటర్‌లో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



ఖమ్మంఅర్బన్: పాండురంగాపురంలోని శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో..